క్లుప్తంగా

సమసమాజ నిర్మాణంలో యువత పాత్ర కీలకం



విద్యారణ్యపురి: సమసమాజ నిర్మాణంలో యువత పాత్ర కీలకమని హనుమకొండ జిల్లా ఇంటర్ విద్యాధికారి గోపాల్ అన్నారు. హనుమకొండలోని ప్రభుత్వ వృత్తివిద్య జూనియర్ కళాశాలలో గురువారం నిర్వహించిన ఫ్రెషర్స్‌డే వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ప్రభుత్వ, వృత్తి విద్య జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ ధర్మేంద్ర, దివాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాలలో ఉత్తమ ప్రతిభ కనపర్చిన విద్యార్థులను సన్మానించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

పింగిళి కళాశాల సందర్శన



హన్మకొండ: హనుమకొండ వడ్డెపల్లిలోని పింగిళి ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలను కమిషనర్ ఆఫ్ కాలేజీ ఎడ్యుకేషన్ ఆర్‌జేడీ ప్రొఫెసర్ ఆర్.రాజేందర్ సింగ్, ఏజీఓ డాక్టర్ డీటీ.చారి గురువారం సందర్శించారు. కళాశాలలో నిర్వహిస్తున్న బీబీఏ కోర్స్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాజేందర్ సింగ్ మాట్లాడుతూ స్కిల్ సెక్టార్ కోర్సుల ప్రాధాన్యం, భవిష్యత్తులో ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ బీ.బీరయ్య, కళాశాల ప్రధానాచార్యులు ప్రొఫెసర్ బీ.చంద్రమౌళి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జీ.సుహాసిని, అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ డీ.పార్వతి, పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై దర్యాప్తు చేయాలి



నయీంనగర్: ట్రైబల్ సర్క్యూట్ (ములుగు – లక్నవరం – మేడారం – తాడ్వాయి – దామరవి – మల్లూరు – బొగత జలపాతం) అమలులో తెలంగాణ టూరిజం భారీ అక్రమాలకు పాల్పడిందని కాగ్ రిపోర్టు ద్వారా తెలిసిందని కాంగ్రెస్ నాయకుడు బక్క జడ్సన్ తెలిపారు. ఈ క్రమంలో నిధుల దుర్వినియోగంపై వెంటనే సీబీఐతో దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ క్లస్టర్‌ను భారత ప్రభుత్వ పర్యాటక శాఖ ఎంపిక చేసి, 2016 – 17లో రూ.79.87 కోట్లు మంజూరు చేసిందన్నారు.

న్యాయవాదుల సహకార సంఘం కార్యవర్గం ఎన్నిక


విజయభాస్కర్, అధ్యక్షుడు


రాము, ఉపాధ్యక్షుడు


కుమార్, కార్యదర్శి

వరంగల్ లీగల్: న్యాయవాదుల కోఆపరేటివ్ సొసైటీ నూతన కార్యవర్గాన్ని డైరెక్టర్లు గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇటీవల ఎన్నికైన నలుగురు డైరెక్టర్లు భిక్షపతి, కృష్ణారావు, రమేష్, యుగేందర్ ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా విజయభాస్కర్, ఉపాధ్యక్షుడిగా రాము, కార్యదర్శిగా కుమార్, కోశాధికారిగా చంద్రశేఖర్ ఎన్నికయ్యారు.

మున్నూరు కాపు సంఘం రాష్ట్ర కార్యదర్శిగా కోటేశ్వరమ్మ

ఖిలా వరంగల్: మున్నూరు కాపు సంఘం రాష్ట్ర కార్యదర్శిగా శివనగర్‌కు చెందిన కాంశెట్టి కోటేశ్వరమ్మ నియమితులయ్యారు. ఈమేరకు ఆమెకు ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య పటేల్ గురువారం నియామక పత్రం అందజేశారు.

మధ్యంతర భృతి పెంచాలి



విద్యారణ్యపురి: తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన 5శాతం మధ్యంతర భృతిని 15శాతానికి పెంచాలని డీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లింగారెడ్డి డిమాండ్ చేశారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్ ఎదుట డీటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా లింగారెడ్డి మాట్లాడుతూ కోర్టులో న్యాయ వివాదాలను పరిష్కరించి పదోన్నతులతో కూడిన బదిలీలు చేపట్టాలని సూచించారు. బదిలీ అయిన స్కూల్ అసిస్టెంట్లను వెంటనే రిలీవ్ చేయాలన్నారు. నిరసన కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్, సుదర్శనం, గోవింద్‌రావు, సభ్యులు, మండలాల బాధ్యులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించండి

● పట్టా పొందిన అంగన్‌వాడీల అభ్యర్థన

హన్మకొండ కల్చరల్: 2008వ సంవత్సరంలో కార్మికులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, జర్నలిస్టులకు ఇళ్లు నిర్మించుకోవడానికి దూపకుంటలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి దివంగత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి పట్టాలు అందజేశారు. అందులో 58 మంది అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు ఉన్నారు. పట్టా పొందిన భూముల్లో ప్రస్తుతం డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించి తమకు సంబంధించిన కార్యకర్తలు, సన్నిహితులకు పాలకులు అందజేస్తున్నారని పట్టా పొందిన అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టా భూముల్లో కొంతమంది లబ్ధిదారులు అప్పు చేసి గృహ నిర్మాణాలను మొదలు పెట్టినట్లు చెప్పారు. బెస్‌మెట్, పిల్లర్ల వరకు కట్టుకున్న నిర్మాణాలను కూల్చివేసి ఇప్పుడు డబుల్ బెడ్రూం ఇళ్లను నిర్మించి తమకు కేటాయించకుండా అన్యాయం చేస్తున్నారని అంగన్‌వాడీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


రాజశేఖరరెడ్డికి అంగన్‌వాడీల పరిస్థితిని వివరిస్తున్న ఇందిర (ఫైల్)

అప్పు చేసి పిల్లర్లు నిర్మించా..



నా భర్త చనిపోయాడు. నా కుమారుడితో కలిసి సొంత ఇంటి కోసం పట్టా పొందిన భూమిలో అప్పు చేసి బెస్‌మెట్ ఏర్పాటు చేసి పిల్లర్లు నిర్మించుకున్నాం. ప్రస్తుతం వాటిని కూల్చి డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించారు. అందులో మాకు డబుల్ బెడ్రూం ఇల్లు మంజూరు చేయాలి.

– మందలి సుజాత, అంగన్‌వాడీ టీచర్

తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నా..



నేను 32 ఏళ్ల నుంచి అంగన్‌వాడీ టీచర్‌గా పనిచేస్తున్నాను. తెలంగాణ ఉద్యమంలో కూడా పాల్గొన్నా. గతంలో సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డిని క్యాంపు కార్యాలయంలో కలిసి అంగన్‌వాడీ సిబ్బంది ఆర్థిక పరిస్థితులను వివరించాను. వెంటనే ఆయన స్పందించి మాకు వరంగల్‌లో దూపకుంటలో భూములను కేటాయించి పట్టాలు అందజేశారు. ఇప్పటి వరకు మాకు ఎలాంటి న్యాయం జరగలేదు.

– కల్లెపెల్లి ఇందిర, అంగన్‌వాడీ టీచర్

క్రీడలతో మానసికోల్లాసం

రామన్నపేట: క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దారుఢ్యం పెంపొందుతుందని ఫిజికల్ డైరెక్టర్ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. స్కూల్ గేమ్ ఆఫ్ ఫెడరేషన్ ఆఫ్ వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎస్‌జీఎఫ్ అండర్ –19 క్రీడాకారుల ఎంపిక పోటీల్లో గురువారం రెండవ రోజు పోటీలను ఆయన ప్రారంభించి ఆయన మాట్లాడారు. జీవితంలో ఒత్తిడికి తలొగ్గకుండా మనోధైర్యాన్ని నింపుతూ రానున్న రోజుల్లో జిల్లా స్థాయి నుంచి జాతీయ, అంతర్జాతీయ క్రీడా పోటీల్లో పాల్గొనే విధంగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ గోపి, జాయింట్ సెక్రటరీ సతీష్, ఫిజికల్ డైరెక్టర్లు శ్రీనివాస్, కిషన్, రమణ, రవి, పద్మ, విజయ్‌కుమార్, ధన్‌రాజ్, రాము, పాపయ్య, సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న పీడీ ప్రభాకర్‌రెడ్డి

జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు ఎల్బీ విద్యార్థి ఎంపిక


దివ్యను అభినందిస్తున్న అధ్యాపకులు

రామన్నపేట: తమిళనాడు రాష్ట్రంలోని హొజూర్‌లో జరగనున్న జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు ఎల్బీ కళాశాలలో డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతున్న ఎం.దివ్య ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ డీహెచ్.రావు తెలిపారు. ఈ సందర్భంగా ఆమెను పీడీ ప్రభాకర్, కళాశాల సెక్రటరీ రాజేందర్, చైర్మన్ నిరంజన్‌రెడ్డి, గేమ్స్ కమిటీ సభ్యులు రాజేశ్వర్‌రావు, శ్రుతి అభినందించారు.

కేటీఆర్ చిత్రపటం దహనం

హన్మకొండ: కాంగ్రెస్ భవన్ ఎదుట యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం మంత్రి కేటీఆర్ చిత్రపటాన్ని దహనం చేశారు.

జడ్జీలను కలిసిన బార్ అసోసియేషన్ ప్రతినిధులు


పూలమొక్క అందజేస్తున్న హనుమకొండ బార్ అసోసియేషన్ బాధ్యులు

వరంగల్ లీగల్: ఇటీవల జరిగిన బదిలీల్లో వరంగల్, హనుమకొండ జిల్లాలకు నూతనంగా వచ్చిన జూనియర్ సివిల్ జడ్జీలను వరంగల్, హనుమకొండ జిల్లాల బార్ అసోసియేషన్ ప్రతినిధులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు. వరంగల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎలుకుర్తి ఆనంద్‌మోహన్, ప్రధాన కార్యదర్శి పసుల యాకస్వామి, జాయింట్ సెక్రెటరీలు పూస శ్రీనివాస్, ఆడెపు కవిత, కోశాధికారి అమృతరావు, కార్యవర్గ సభ్యులు పద్మావతి, శంకరాచార్యులు, జగదీష్, రమేష్, పూర్ణచందర్, హనుమకొండ జిల్లా బార్ అసోసియేషన్ బాధ్యులు పాల్గొన్నారు.

భద్రకాళి చెరువు ప్రాంతాన్ని రక్షించాలి

వరంగల్ అర్బన్: భద్రకాళి చెరువు పరివాహక ప్రాంతాలను కబ్జాల నుంచి కాపాడాలని చెరువులు, భూముల పరిరక్షణ కమిటీ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈమేరకు బల్దియా ప్రధాన కార్యాలయం ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడు పెరుమాండ్ల లక్ష్మణ్ మాట్లాడుతూ గత ఆరు నెలల నుంచి భద్రకాళి చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్, తదితర స్థలాలను కబ్జా చేసేందుకు కబ్జాదారులు తీవ్రంగా ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం, అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవ తీసుకొని భూములను కాపాడాలని కోరారు.



ధర్నా చేస్తున్న కమిటీ ప్రతినిధులు

దేవీ నవరాత్రోత్సవాలను విజయవంతం చేయాలి


ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న అర్చకులు

కాజీపేట: కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో దేవీ నవరాత్రోత్సవాలను విజయవంతం చేయాలని ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకుడు ఐనవోలు రాధాకృష్ణశర్మ అన్నారు. శ్వేతార్కుడికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఉత్సవ కరపత్రాలు, ఆహ్వాన పత్రికలను గురువారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆలయంలోని లక్ష్మి, సరస్వతి, అన్నపూర్ణ, గాయత్రి మాతలకు ప్రతి నిత్యం అర్చకులు, భక్తులు, కార్యకర్తలు ప్రత్యేక అలంకరణ పూజలు జరిపించేలా తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సాయికృష్ణ శర్మ, బ్రహ్మశ్రీ కందికోట శ్రీనివాస్ శర్మ, అయినవోలు వెంకటేశ్వర శర్మ, సుధీర్, మణిదీప్, అరుణ్‌రెడ్డి పాల్గొన్నారు.

గిరిజన యూనివర్సిటీ తెలంగాణకు వరం

కాశిబుగ్గ: గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటు తెలంగాణ ప్రజానీకానికి ఓ వరమని డాక్టర్ వన్నాల వెంకటరమణ అన్నారు. ములుగు జిల్లాలో గిరిజన విశ్వవిద్యాలయాన్ని కేంద్రం మంజూరు చేసి రూ.900 కోట్ల నిధులు విడుదల చేస్తూ క్యాబినెట్ ఆమోదం తెలపడంపై బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాశిబుగ్గ జంక్షన్‌లో ప్రధాని మోదీ చిత్రపటానికి గురువారం పాలాభిషేకం చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ నిజామాబాద్‌లో పసుపు బోర్డు ప్రకటించడం కూడా గొప్ప నిర్ణయమని అన్నారు. కార్యక్రమంలో నాయకులు కుసుమ సతీష్, ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, రత్నం సతీష్ షా, సముద్రాల పరమేశ్వర్, మార్టిన్ లూథర్, కనుకుంట్ల రంజిత్, అల్లం నాగరాజు, ఉపేందర్, రాజు, శ్రీనివాస్ గుప్తా, మహేష్ పాల్గొన్నారు.


మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

అర్హులైన పేదలందరికి 'గృహలక్ష్మి' వర్తింపజేయాలి

న్యూశాయంపేట: ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకుని జీవిస్తున్న పేదలందరికి గృహలక్ష్మి పథకం వర్తింపజేయాలని సీపీఎం హనుమకొండ జిల్లా కార్యదర్శి బొట్ల చక్రపాణి డిమాండ్ చేశారు. హనుమకొండ పార్టీ కార్యాలయంలో గురువారం జరిగిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇళ్లు లేని పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు కట్టిస్తామని హామీ ఇచ్చి ప్రభుత్వం విస్మరించిందని అన్నారు. ప్రభుత్వ భూములు కబ్జా అవుతుంటే పేదలను సమీకరించి, భూపోరాటాలు నిర్వహించి ఇళ్లులేని పేదలకు తాము నిలువ నీడ కల్పించినట్లు చక్రపాణి తెలిపారు.

ఆకట్టుకుంటున్న పరిణయ వస్త్ర ప్రదర్శన


వస్త్రాలను కొనుగోలు చేస్తున్న మహిళలు

హన్మకొండ: హనుమకొండలోని అశోకా హోటల్‌లో ఏర్పాటు చేసిన పరిణయ వస్త్ర ప్రదర్శన మగువల మనసును దోచుకుంటోంది. ఈ సందర్భంగా ఎగ్జిబిషన్ నిర్వాహకుడు టీవీ.రావు మాట్లాడుతూ వివాహం, పండుగలతో పాటు ఇతర ప్రత్యేక సందర్భాల్లో ధరించే విధంగా దేశంలో పేరుగాంచిన ఉప్పాడ, కలంకారి, మంగళగిరి, ప్రింట్, సిల్క్ చీరలు, కాటన్, కాశ్మీర్ సిల్క్, బ్లౌసులు, టాప్స్, వన్‌గ్రాం గోల్డ్ జ్యువెల్లరీ మొదలగునవి అందుబాటులో ఉన్నాయని వివరించారు. ఈ వస్త్ర ప్రదర్శన ఈనెల 6వ తేదీతో ముగుస్తుందని తెలిపారు. వివరాలకు 94411 83981 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

సంక్షిప్తంగా

ఎంజీఎంలోని సమస్యలు పరిష్కరించాలి

ఎంజీఎం: ఎంజీఎం ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలపై మంత్రి కేటీఆర్ దృష్టి సారించి పరిష్కరించాలని బీజేపీ నాయకుడు, న్యాయవాది అల్లం నాగరాజు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎంజీఎంలో సమస్యలపై ఎన్నిసార్లు వినతి పత్రం సమర్పించినా ఫలితం లేదని పేర్కొంటూ ఆస్పత్రిలో గురువారం నిరసన తెలిపి గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు.

ఆర్ట్స్ కళాశాలలో కొనసాగుతున్న దీక్షలు

కేయూ క్యాంపస్: యూనివర్సిటీల్లోని కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో కాంట్రాక్టు లెక్చరర్ల దీక్షలు కొనసాగుతున్నాయి. దీక్షలో కుక్కా కన్వీనర్ డాక్టర్ చిర్ర రాజు, బాధ్యులు కనకయ్య, సతీష్‌కుమార్, సదాశివ్, సాయిచరణ్, ప్రసాద్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యార్థి జేఏసీ దీక్షలు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో పీహెచ్‌డీ అడ్మిషన్లలో అవకతవకలపై ప్రశ్నిస్తూ ఆందోళన చేసిన విద్యార్థులను టాస్క్‌ఫోర్స్ పోలీసులతో కొట్టించిన వీసీ తాటికొండ రమేష్, రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రావును బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ క్యాంపస్‌లోని దూరవిద్యా కేంద్రం ఆవరణలో నిర్వహిస్తున్న విద్యార్థి జేఏసీ దీక్షలు గురువారం 30వ రోజుకు చేరుకున్నాయి.

మధ్యాహ్న భోజన కార్మికుల బిక్షాటన

విద్యారణ్యపురి: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వారం రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదని మధ్యాహ్న భోజన కార్మికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈమేరకు సీఐటీయూ ఆధ్వర్యంలో హనుమకొండలో డీఈఓ కార్యాలయం సమీపంలోని అదాలత్ సెంటర్‌లో కార్మికులు గురువారం బిక్షాటన చేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు వేల్పుల సారంగపాణి, శ్రామిక మహిళా కన్వీనర్ నిడిగొండ రజిత, బాధ్యులు పద్మ, శాంత, పరివీణ పాల్గొన్నారు.

వేతనాలు ఇస్తేనే అల్పాహారం

హసన్‌పర్తి: కుకింగ్ చార్జీలు, వంట సామగ్రి, వేతనాలు ఇస్తేనే విద్యార్థులకు అల్పాహారం అందించడానికి ముందుకు వస్తారని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రామ్మూర్తి హెచ్చరించారు. పాఠశాలల్లో అల్పాహారం అందిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించిన నేపథ్యంలో పెండింగ్‌లో ఉన్న బకాయిలు వెంటనే చెల్లించాలని కోరుతూ హసన్‌పర్తి మండల విద్యాశాఖ కార్యాలయం ఎదుట మధ్యాహ్న భోజన కార్మికులు గురువారం ధర్నా నిర్వహించారు. మధ్యాహ్న భోజన కార్మిక సంఘం హసన్‌పర్తి మండల అధ్యక్షురాలు లక్ష్మి, సభ్యులు రమాదేవి, సంపూర్ణ, వరలక్ష్మి, అరుణ, రాణి పాల్గొన్నారు.

కల్వకుంట్ల కుతంత్రాలకు కాలం చెల్లింది

ఖిలా వరంగల్: కల్వకుంట్ల కుటుంబం ప్రయోగించిన రాజతంత్రం, కుతంత్రాలకు తెలంగాణలో కాలం చెల్లిందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కుసుమ సతీష్ ఆరోపించారు. వరంగల్ శివనగర్‌లోని తూర్పు బీజేపీ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డబుల్ బెడ్రూం ఇళ్ల పంపకాల విషయంలో అక్రమాలు జరుగుతున్నాయని విమర్శించారు. 9ఏళ్ల పాలనలో ఏ ఒక్క పథకాన్ని 15శాతం కూడా పూర్తి చేయని అసమర్థత ప్రభుత్వమని దుయ్యబట్టారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

కాశిబుగ్గ: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులందరు సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ సాంస్కృతిక సారథి (టీఎస్ఎస్) కళాకారులు సూచించారు. 18వ డివిజన్ లేబర్‌కాలనీలో కళాకారులు గురువారం పాటలు పాడుతూ విస్తృత ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందన్నారు.

టాలెంట్ ఈవెంట్‌తో ప్రతిభకు మెరుగు



హన్మకొండ: విద్యార్థుల ఆచరణాత్మక పరిజ్ఞానాన్ని ప్రదర్శించేందుకు, వారిలో పోటీతత్వం, ప్రతిభను మెరుగుపరిచేందుకు టాలెంట్ హంట్ ఈవెంట్ విజ్ఞాన ప్రదర్శన ఒక మంచి వేదిక అని కమిషనరేట్ ఆఫ్ కాలేజీ ఎడ్యుకేషన్ జాయింట్ డైరెక్టర్ ప్రొఫెసర్ రాజేందర్ సింగ్ అన్నారు. హనుమకొండ నయీంనగర్‌లోని వాగ్దేవి డిగ్రీ, పీజీ కళాశాలలో కామర్స్ – బిజినెస్ మేనేజ్‌మెంట్ ఎగ్జిబిషన్, టాలెంట్ హంట్ ఈవెంట్ గురువారం జరిగింది. ఈ సందర్భంగా వాణిజ్య – వ్యాపార నిర్వహణ విభాగం విద్యార్థులు బీబీఏ రిటైల్ ఆపరేషన్స్, లాజిస్టిక్స్, ఫైనాన్షియల్ ట్రాన్సాక్షన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగం, ప్రాంప్ట్ ఇంజనీరింగ్‌లో కామర్స్ పాత్రపై విభిన్న ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. ట్రెజర్ హంట్, ఇతర పోటీల విజేతలకు నగదు బహుమతి, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై హర్షం

కేయూ క్యాంపస్: ఇతర రాష్ట్రాలో జాతీయ విద్యా సంస్థల్లో చదువుకునే బీసీ విద్యార్థులకు ప్రతి ఏడాది రూ.రెండు లక్షల ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంపై బీసీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరుణహరి శేషు హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇతర రాష్ట్రాలో ఐఐటీ, నిట్, ఐఐఎం, ట్రిపుల్ ఐటీ, బిట్స్‌లాంటి 200ల విద్యాసంస్థల్లో చదువుకునే బీసీ విద్యార్థులకు గొప్ప వరమని అన్నారు.

రేపు రజక సంఘం వంటా – వార్పు

కాజీపేట: చాకలి ఐలమ్మ విగ్రహాన్ని అపహరించిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోకుండా అధికారులు కాలయాపన చేయడాన్ని నిరసిస్తూ ఫాతిమానగర్ చౌరస్తాలో శనివారం వంటా – వార్పు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు రజక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నార్లగిరి రామలింగం తెలిపారు. కాజీపేట 61వ డివిజన్ సిద్ధార్థనగర్ కాలనీలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రజక సంఘం నాయకులకు చీఫ్ విప్ వినయ్‌భాస్కర్, ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు.

వన్యప్రాణులను కాపాడుదాం

హసన్‌పర్తి: వన్యప్రాణులను కాపాడుదామంటూ విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. వణ్యప్రాణుల సప్తాహం – 2023లో భాగంగా హసన్‌పర్తి మండల కేంద్రంలోని సుజాత విద్యానికేతన్ పాఠశాలలో గురువారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ ఆకుతోట రాంబాబు మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని చెప్పారు.

నేడు మున్నూరు కాపు భవనానికి శంకుస్థాపన

రామన్నపేట: హనుమకొండ అలంకార్ జంక్షన్ వద్ద మున్నూరు కాపు భవన నిర్మాణానికి శుక్రవారం ఉదయం మంత్రి కేసీఆర్ శంకుస్థాపన చేయనున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య తెలిపారు. సంఘ భవనంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు కటకం పెంటయ్య, కోఆర్డినేటర్ కనుకుంట్ల రవికుమార్, రాష్ట్ర కార్యదర్శి శ్రీధర్, జిల్లా కార్యదర్శి తోట తిరుపతయ్య, కందుల సృజన్ తదితరులు పాల్గొన్నారు.

భద్రకాళి దేవాలయంలో పూజలు

హన్మకొండ కల్చరల్: హనుమకొండ 9వ డివిజన్‌లోని న్యూరాయపురలోని భద్రకాళి మున్నూరు కాపు పరపతి సంఘం ప్రథమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ఉదయం భద్రకాళి దేవాలయంలో సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు పోతురాజు తిరుమలరావు, ప్రధాన కార్యదర్శి లక్కాకుల రాజుపటేల్, కోశాధికారి సత్తు భిక్షపతి, సలహాదారుడు బొల్లం అమరావతి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

నేడు కేఎంసీలో భరతనాట్య ప్రదర్శన

హన్మకొండ కల్చరల్: నగరానికి చెందిన ప్రముఖ కూచిపూడి నృత్యకారిణి, నాట్య మయూరి, నాట్య విదూషి సంధ్యారాణి కుమార్తె ఆకురాతి సంతోషి ఈక్షిత.. భరతనాట్య రంగప్రవేశం జరగనుందని హనుమకొండ శ్రీశివానంద నృత్యమాల నిర్వాహకుడు, నృత్యగురువు బొంపల్లి సుధీర్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం సాయంత్రం 5గంటలకు వరంగల్ కాకతీయ మెడికల్ కళాశాలలోని ఎన్ఆర్ఐ ఆడిటోరియంలో ప్రదర్శన ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

పోగొట్టుకున్న ఫోన్ల అప్పగింత

రామన్నపేట: పోగొట్టుకున్న మండల వేణు, సతీష్‌కు చెందిన మొబైల్ ఫోన్లను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ట్రేస్ చేసి బాధితులకు గురువారం అప్పగించినట్లు మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ ఎన్.వెంకటేశ్వర్లు తెలిపారు. మొబైల్ ఫోన్లు పోగొట్టుకుంటే వెంటనే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

ప్రాక్టీసింగ్ పీఎస్‌లో 'అల్పాహారం' ప్రారంభం

విద్యారణ్యపురి: హనుమకొండలోని ప్రభుత్వ ప్రాక్టీసింగ్ ప్రాథమిక పాఠశాలలో అల్పాహార కార్యక్రమాన్ని మంత్రి కేటీఆర్ శుక్రవారం ఉదయం ప్రారంభించనున్నారు. హనుమకొండ జిల్లాలోని మిగతా పాఠశాలల్లో దసరా సెలవుల తర్వాత కార్యక్రమాన్ని అమలు చేయనున్నట్లు డీఈఓ అబ్దుల్‌హై వివరించారు. అక్షయ పాత్ర సంస్థ ద్వారా అల్పాహారం అందించనున్నట్లు చెప్పారు.

ఒకే గ్రామం నుంచి నలుగురు కానిస్టేబుళ్లు

హసన్‌పర్తి: బుధవారం విడుదలైన కానిస్టేబుళ్ల ఉద్యోగ ఎంపికలో హసన్‌పర్తి మండలం సిద్ధాపురానికి చెందిన నలుగురు.. కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికయ్యారు. జనగాం సంజయ్, అనగాని అజయ్, బొక్క అన్వేష్, దామెర ప్రవళికను పలువురు అభినందించారు.

ఇంటింటికి కాంగ్రెస్ గ్యారంటీ కార్డుల పంపిణీ

కాజీపేట: కాజీపేట 63వ డివిజన్ విద్యానగర్ కాలనీలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీ అభయ హస్తం ఆరు గ్యారంటీ కార్డులను స్థానిక కార్పొరేటర్ విజయశ్రీ ఆధ్వర్యంలో నాయకులు గురువారం ఇంటింటికి పంపిణీ చేశారు.

కేటీఆర్ సభను విజయవంతం చేద్దాం

కాశిబుగ్గ: ఖిలా వరంగల్ వాకింగ్ గ్రౌండ్‌లో శుక్రవారం జరగనున్న కేటీఆర్ సంక్షేమ సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ పిలుపునిచ్చారు. 23వ డివిజన్‌కు చెందిన పలువురు నాయకులు తూర్పు ఎమ్మెల్యే నరేందర్ సమక్షంలో గురువారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిక

కాజీపేట రూరల్: 48వ డివిజన్ దర్గా కాజీపేటకు చెందిన పలువురు నాయకులు గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి హనుమకొండ డీసీసీ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి ఆహ్వానించారు.

బీజేపీలో చేరికలు

హన్మకొండ: హనుమకొండ కాకతీయ యూనివర్సిటీకి చెందిన పూర్వ విద్యార్థులు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా హంటర్‌రోడ్డులోని క్యాంపు కార్యాలయంలో గురువారం వారికి బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

పశ్చిమ అభివృద్ధిపై చర్చకు సిద్ధమా?

కాజీపేట అర్బన్: పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధిపై చర్చకు ఐటీ శాఖ మంత్రి కేటీఆర్, చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్.. సిద్ధమా అంటూ డీసీసీబీ మాజీ చైర్మన్ జంగా రాఘవరెడ్డి సవాల్ చేశారు. హంటర్ రోడ్డులోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో రాఘవరెడ్డి మాట్లాడుతూ గతంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ఎన్నికల్లో ఓట్లు దండుకోవడానికి కేటీఆర్ పర్యటన విడ్డూరంగా ఉందని ఎద్దేవాచేశారు. కాజీపేటలో బస్టాండ్, కోచ్ ఫ్యాక్టరీ, ఇంటర్, డిగ్రీ కళాశాలల ఏర్పాటు ఏమైనట్లని ప్రశ్నించారు. నియోజకవర్గంలో నిర్మించిన డబుల్‌బెడ్రూం ఇళ్ల పంపిణీలో పాలకులు జాప్యం చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు జక్కుల రవీందర్‌యాదవ్, సయ్యద్ విజయశ్రీ రజాలీ, మాజీ కార్పొరేటర్ తొట్ల రాజు, నాయకులు కట్ల శ్రీనివాస్, ధనరాజ్, గంగుల శ్రీనివాస్‌రెడ్డి, విజయ్‌కుమార్, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జంగా రాఘవరెడ్డి

పట్టాదారులకు న్యాయం చేయాలి


బాధితులతో ఎర్రబెల్లి ప్రదీప్‌రావు

ఖిలా వరంగల్: కాంగ్రెస్ పాలకులు పంపిణీ చేసిన ఇళ్ల స్థలాల పట్టాదారులకు తొలుత డబుల్‌బెడ్రూం ఇళ్లు అందజేసి వారికి న్యాయం చేయాలని వరంగల్ అర్బన్ కో ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్, బీజేపీ నేత ఎర్రబెల్లి ప్రదీప్‌రావు డిమాండ్ చేశారు. ఈమేరకు వరంగల్ 33వ డివిజన్ రైల్వేగేట్ పెరకవాడ రహదారిపై ఇళ్ల పట్టాలు పొందిన అర్హులతో కలిసి గురువారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు పంపిణీ చేసిన భూమిలో బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించి పట్టాదారులను విస్మరించడం బాధాకరమని వాపోయారు. లబ్ధిదారుల జాబితాలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల పేర్లే ఉండటం అన్యాయమని అన్నారు. ఈ కార్యక్రమంలో మంద శ్రీనివాస్, చిలువేరు రాజేందర్, ముత్తినేని శ్రీనివాస్, ముద్దసాని కృష్ణ, వీరస్వామి, వీరన్న, శ్రీనివాస్, కేశవ్, రాజేష్ ఉపాధ్యాయ, శంకర్, సతీష్, బాధితులు పాల్గొన్నారు.

పదినెలలు గడిచినా పూర్తికాని రోడ్డు

న్యూశాయంపేట / కాశిబుగ్గ: వరంగల్ తూర్పు నియోజకవర్గ పరిధిలోని 35, 36వ డివిజన్ల మెయిన్ రోడ్డు విస్తరణ పనులు గత సంవత్సరం డిసెంబర్ 2న మంత్రి కేటీఆర్ పర్యటన సందర్భంగా మొదలుపెట్టి, పర్యటన అనంతరం పనులు ఆపేశారని బీజేపీ నాయకులు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, కుసుమ సతీష్ ఆరోపించారు. శివనగర్ వాటర్ ట్యాంక్ మెయిన్‌రోడ్డుపై కార్యకర్తలతో కలిసి గురువారం రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల సమస్యలను పరిష్కరించడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలం అయిందని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు ఆడెపు వెంకటేష్, రంజిత్, రఘునారెడ్డి, రాజు, మహేష్, నాగరాజు, వెంకటయ్య, కృష్ణ పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు